# రాజకీయం

సి.వి. సర్వేశ్వర శర్మ
కుమారి చావలి శ్రీవాగ్దేవి

రాఘవరావు ఉదయం లేవగానే వ్యాయామం చేస్తాడు. ఈ అలవాటు అతనికి ఊహ తెలిసినప్పటి నుండి ఉంది. అన్ని పనులతో బాటు శరీర వ్యాయామం ఒక పని అతనికి. యాభయ్యోపడిలో పడినా ముప్పయ్యో పడిలో మనిషిలా ఉంటాడు. వ్యాయామం చేయడం వల్ల పని చేసే తీరులో తేడా ఉంటుందని రాఘవరావు నమ్మిక.

ఎన్ని సార్లు హెచ్చరికగా చెప్పినా కొడుకు సత్యానందం ఆలస్యంగా మంచం మీద నుండి లేస్తాడు. పన్లన్నీ బద్ధకంగా సాగిస్తాడు. కొడుక్కి మంచి అలవాట్లు నేర్పటం లేదని భార్య రుక్మిణి మీద విసుక్కుంటాడు. రాఘవరావు చాదస్తుడని తల్లీ కొడుకులు మవునంగా ఉంటారు.

రాఘవరావుని ఆశ్చర్యపరచే విషయం సత్యానందం చదువు. ఎప్పుడూ చదివినట్లు కనబడడు. స్కూల్లో మంచి మార్కులతో పాసవ్వడమే కాదు ఎవ్వరినీ ఆశ్రయించకుండా కాలేజీలో సీటు వచ్చింది. కాలేజీ చదువు అంతే. ఇంజనీరింగ్‌లో సీటు సంపాదించుకున్నాడు.

తేడా ఎక్కడ ఉందో రాఘవరావుకు అర్థం కాదు. పిల్లలు తెలివితేటలు పెరిగాయి. వాళ్లకు ఉన్న అవకాశాలు, అనుభవాలు తమ చిన్నతనంలో లేవు. అయినా అప్పుడూ, ఇప్పుడూ, ఎప్పుడూ పోటీ విషయంలో పెరుగుదల ఉంటోంది కాని తగ్గుదల లేదు కదా?

అర్థం కాని ఈ సమస్యకు జవాబు దొరక లేదు రాఘవరావుకు. చదువులో మేలుగా వస్తున్నాడు కాబట్టి వాడిని ఏమైనా అంటే భార్య ఒప్పుకునే పద్ధతిలో ఉండదు.

'శరీరం చురుగ్గా ఉంటే మెదడు చురుగ్గా ఉంటుంది' ఎన్నో సార్లు చెప్పాడు. కొడుకు మామూలుగానే వింటాడు. మనసుకు పట్టించుకోడు.

'రుక్మిణీ : మొక్కలకు నీళ్లు పోశావా?' ఇంటి ఆవరణలో పెంచిన పూల మొక్కలను చూసి ఇంట్లోకి వినిపించేలా అడిగాడు.

'పోస్తాను : వస్తానుండండి' రుక్మిణి జవాబు చెప్పింది. రాఘవరావు ఇంటిని చూసుకుని మురిసిపోతాడు. పేద కుటుంబంలో పుట్టి ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంటూ చదువు సాగించి ఉద్యోగంలో చేరాడు. క్రమశిక్షణ, కృషి ఈ రెండింటిని నమ్ముకుని జీవితం సాగిస్తున్నాడు. తన కష్టార్జితం. ఈ ఇల్లు, అందుకే ఇల్లంటే అంత అభిమానం రాఘవరావుకు.

ఇంటికి కాంపౌండు గోడ కట్టించాడు. చక్కటి గేటు పెట్టించాడు. ఇంటి ఆవరణలో పచ్చగడ్డి ఏపుగా పెరిగింది. తనకు ఖాళీ సరిపోవడం లేదు. లేకపోతే ఈ పచ్చగడ్డి పీకేసేవాడు.

గేటు తీసిన చప్పుడయింది. రాఘవరావు ఆలోచనల నుండి మామూలు వాతావరణంలోకి వచ్చాడు. ఆవరణలోకి ఒక యువకుడు ప్రవేశించాడు.

రాఘవరావు అతన్ని పరిశీలనగా చూశాడు. మంచి బలంగా ఉన్నాడు. పాతిక సంవత్సరాల వయస్సు ఉండవచ్చు. చేతిలో ఒక పళ్లెం మెడలో దేముడి పటం. పళ్లెంలో చిల్లర పైసలున్నాయి తోడుగా కుంకం కూడా ఉంది.

'ఏమిటి?' రాఘవరావు గంభీరంగా అడిగాడు.

'కుంకం : దేముడి కుంకం : బొట్టు పెట్టుకోండి" యువకుడు అన్నాడు.

రాఘవరావు తెల్లబోయాడు. రుక్మిణి పని చేసుకుంటున్న పని ఆపుకుని తడి చేతులు కొంగుకు తుడుచుకుంటూ కుంకం బొట్టు పెట్టుకునేందుకు బయటకు వచ్చింది.

రాఘవరావు వారించబోయాడు. కుంకం అంటే మాటలా. ఆమె వినిపించుకునే ధోరణిలో లేదు. రూపాయి బిళ్ల పళ్లెంలో వేసింది. నుదుట కుంకం పెట్టుకుంది.

రాఘవరావుకు చాలా కోపం వచ్చింది. రుక్మిణితో వాదించి లాభం లేదు. 'మంచి బలంగా ఉన్నావు. కష్టపడి పని చేసుకుని సంపాదించుకోవచ్చు కదా?' రాఘవరావు అడిగాడు.

యువకుడు రాఘవరావువైపు వచ్చాడు. 'బొట్టు పెట్టుకోండి' చెప్పాడు.

'బొట్టు అడ్డు పెట్టుకుని సంపాదించడం సిగ్గుగా లేదూ. కష్టపడి సంపాదించుకుంటే అందులో ఎంత తృప్తి ఉంటుందో తెలుసా? ఏదైనా పని చేసుకోకూడదా?' ఆ యువకుడిని మార్చాలనే ధోరణిలో రాఘవరావు మాట్లాడుతున్నాడు.

యువకుడు రాఘవరావు మాటలు పట్టించుకునే పద్ధతిలో లేడు. రాఘవరావు చెప్పాడు :'ఇలా అడుక్కోవడం సిగ్గుగా లేదూ. 'మా ఇంటి ఆవరణలో ఉన్న ఈ పచ్చగడ్డి కోసెయ్యి. నీకు కడుపు నిండా అన్నం పెట్టిస్తా' డబ్బులిస్తే దుర్వ్యసనాలకు బానిసలవుతారని రాఘవరావు భయం.

యువకుడు సమాధానం ఏమీ చెప్పలేదు. మాట్లాడకుండా వెళ్లిపోయాడు.

రాఘవరావు నిట్టూర్చాడు. ఆదివారం. కాలక్షేపం బాగానే ఉందనుకున్నాడు. చక్కగా వేడి నీటి స్నానం చేసి వరండాలో ఉన్న కుర్చీలో కూర్చుని దినపత్రిక తిరగవేస్తున్నాడు.

గేటు తీసుకుని ఒక వృద్ధుడు లోపలకు వచ్చాడు. చేతిలో బాగా మాసిన సంచీ ఉంది. రాఘవరావు అతడికేసి చూశాడు. ముష్టి కోసం వచ్చాడు. వృద్ధుడయినా పని చేసే శక్తి ఉన్నట్లు కన్పించాడు.

'ఇలా ముష్టెత్తుకోపోతే హాయిగా ఏదైనా పని చేసుకోరాదూ!' రాఘవరావు అడిగాడు.

'ముష్టెత్తుకోవడం నాకు సరదానా బాబుగారు! పని చూపించండి. పని చేస్తాను' వృద్ధుడు అన్నాడు.

'నీ పేరు'

'ముసలయ్య'

'మా ఇంటి ఆవరణలో అదిగో ఆ కన్పించే గడ్డి కోసెయ్యి. నీకు కడుపు నిండా అన్నం పెడతా' రాఘవరావు అన్నాడు.

'కొడవలి ఇప్పించండి' ముసలయ్య అడిగాడు. రాఘవరావు ఇంట్లోకి వెళ్లి కొడవలి తీసుకువచ్చి ఇచ్చాడు. ముసలయ్య పని ప్రారంభించాడు. చాలా సులువుగా చురుగ్గా పని చేస్తున్నాడు. రాఘవరావుకి ముసలయ్య పని తనం నచ్చింది. మెచ్చుకున్నాడు. రుక్మిణి ముసలయ్యకు అన్నం వడ్డించింది.

ముసలయ్య భోజనం ముగించాడు.

రాఘవరావు ముసలయ్యకు అయిదు రూపాయలు ఇచ్చాడు. ముసలయ్య కృతజ్ఞతతో దండాలు పెట్టాడు.

'ఇంత పని తనం గల నువ్వు పనిలోకి ఎందుకు వెళ్లటం లేదు?' రాఘవరావు ఉండబట్టలేక అడిగాడు.

విచారంగా ముసలయ్య ముఖం పెట్టాడు.

'కూలీలకు మేస్త్రీ కూలి పని చూపిస్తాడు. మేస్త్రీ చెప్పినట్టు వినాలి. లేకపోతే కూలి పని దొరకదు'

'మేస్త్రీకి నీలాంటి పనివాళ్లు ఉంటే అతనికి పేరు వస్తుంది కదా!'

'కూలి పనికి కుర్రాళ్లు బాగా చేస్తారని కామందులు వాళ్లని పంపమని మేస్త్రీని ఒత్తిడి చేస్తున్నారు. ఒకొక్కప్పుడు పనిని బట్టి నేను కూడా ఆళ్లతో వెళ్లేవాడిని.'

'నీ పనితనానికి కామందు మెచ్చలేదా?'

"కుర్ర కూలీలు పని బద్ధకంతో చురుగ్గా పని చేయరు. నాకు పని అలవాటు. 'ముసలయ్య చేసిన పని మీరు చేయలేక పోతున్నారని' కామందులు అంటున్నారు.


సినిమా కుర్ర కూలీలకు దేముడు. ఆడకూలీ పక్క నుంటే గాని మగకూలీ పని చెయ్యడు. కామందు కనుమరుగైతే ఆడ–మగ కబుర్లు. పని ఎక్కడ ముందుకు సాగుతుంది."

రాఘవరావు ఆశ్చర్యంగా వింటున్నాడు.

"మేస్త్రీ దగ్గర కుర్ర కూలీలు పరపతి సంపాదించారు. నా మీద చాడీలు చెప్పారు. మేస్త్రీ నన్ను తిట్టాడు. పన్లోకి రావద్దన్నాడు" కన్నీరు పెట్టుకుంటూ ముసలయ్య చెబుతున్నాడు.

'నువ్వు సొంతంగా కూలి పనికి వెళ్లొచ్చుగా?' రాఘవరావు అడిగాడు. కూలి పనులు, మేస్త్రీల వ్యవస్థ గురించి రాఘవరావుకు పూర్తిగా తెలియదనిపించింది.

"రోజూ పని వెతుక్కోవడం మాటలా బాబు? పనులు కావలసిన వారు మేస్త్రీ దగ్గరకు వస్తారు. మేస్త్రీ కూలీ మనుషుల్ని పంపిస్తాడు. సొంతంగా కూలీ పనికి నేనొక్కడిని వెళ్లి ఏమి చేయగలను?" ముసలయ్య చెప్పినది నిజమనిపించింది రాఘవరావుకు.



మనదేశానికి స్వాతంత్రం వచ్చి నలభయి ఏళ్లయింది. రాజకీయం ఎదిగినంత చురుగ్గా మనుషుల్లో పని చేసే స్వభావం ఎదగలేదు. పైగా పని చేసే వాళ్లని తమ కుయుక్తులతో యువకులు బయటకు పంపించేస్తే దేశం ఏమి అభివృద్ధి సాధిస్తుంది?

రాఘవరావుకు ఆలోచిస్తుంటే ఒక విషయం స్పష్టమయింది. తను పని చెయ్యడు కాబట్టి పని చేసేవాడు ఉండకూడదు. పని చేసే వాళ్ళు లేకపోతే ఏమాత్రం కొంచెం పని చేసినా తనే గొప్పవాడయి పోతాడు. ఇదే ప్రస్తుతం నాయకులో ఉన్న పనికి మాలిన రాజకీయం.

'చిత్తశుద్ధితో, దేశప్రగతికి పాటుపడే విధంగా యువత నడుం కట్టి పని సామర్థ్యాన్ని పెంచుకునే విధంగా కృషి చేయాలి. దానికి యువతను తట్టి లేపాలి. ఒక ఉద్యమం మొదలవ్వాలి. విశేషమైన తెలివి, నైపుణ్యం యువకుల్లో వ్యతిరేక ధోరణులలో ఎదగకూడదు. వాళ్లని క్రమశిక్షణతో ఉత్సాహపరుస్తూ, హెచ్చరిస్తూ ముందుకు నడపగల నాయకుడు కావాలి' అన్పించింది రాఘవరావుకు.

ఇంటింటా ఒక నాయకుడు ఉండాలి. ముందు తన కొడుక్కి ఉత్తేజం కల్పించాలని రాఘవరావు నిర్ణయించుకున్నాడు. □